క్లుప్తంగా

నేడు నీటి దీపావళి

నగరి: మున్సిపల్ పరిధిలోని సత్రవాడ సమ్మర్ స్టోరేజి ట్యాంకు వద్ద మంగళవారం నీటి దీపావళి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నీళ్లకోసం మహిళలు, మహిళల కోసం నీరు అనే అంశంపై సత్రవాడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద అవగాహన కల్పిస్తామన్నారు. మున్సిపల్ డైరెక్టర్ కాశేశ్వరం వారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పురపాలక సిబ్బంది, మెప్మాసిబ్బంది, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు హాజరుకావాలన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

వెదురుకుప్పం: మండలంలోని తెల్లగుండ్లపల్లెలో సోమవారం అయ్యప్ప మాలలు ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకిలో ప్రతిష్ఠించి అంగరంగ వైభవంగా ఊరేగించారు. 41 రోజుల పాటు మండల దీక్ష అనంతరం శబరిమలైకు అయ్యప్ప దర్శనార్థం వెళ్తామని గురుస్వామి గోవిందయ్య తెలిపారు.

కాలభైరవ స్వామికి వడమాల అలంకరణ


కాలభైరవున్ని దర్శించుకుంటున్న భక్తులు

నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలోని శ్రీ కాలభైరవ స్వామి సన్నిధిలో అష్టమి పూజలు విశేషంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. కలశాభిషేకం చేసి భక్తులు సమర్పించిన వడమాలలతో స్వామివారిని అలంకరించారు. భక్తులకు నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అరుణగిరిపై ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కొండమల్లీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వరునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

9న తిరుపతిలో విద్యుత్ అదాలత్

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) పరిధిలోని తిరుపతి టౌన్ డివిజన్‌లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాసుదేవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్ పర్సన్ శ్రీనివాసఆంజనేయ మూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. తిరుపతి పట్టణం, పాత తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ ఆలయం సమీపంలో ఉన్న ఎస్పీడీసీఎల్ తిరుపతి టౌన్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్విమ్స్‌లో కంటి ఆపరేషన్లు

తిరుపతి తుడా: 'జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో పలువురికి కంటి సంబంధిత వ్యాధులను గుర్తించారు. కంటి శుక్లాలు ఆపరేషన్లు అవసరమైన వారిని స్విమ్స్ శ్రీపద్మావతి ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేశారు..'అని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం కంటి శుక్లాలు ఆపరేషన్లు చేసుకున్న రోగులను పరామర్శించారు. ఆస్పత్రిలో వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ వెంకటాచలం, భావన వెంకటాచలం, స్విమ్స్ అష్టమాలజీ వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హాస్టల్ ఫుడ్.. వెరీ గుడ్

- వసతిగృహాల్లోని విద్యార్థులకు వారంలో ఆరు రోజుల పాటు కోడిగుడ్డు
- మూడురోజుల పాటు చికెన్‌కర్రీతో కూడిన భోజనం
- పెంచిన కాస్మొటిక్ చార్జీలు
- అమల్లోకి వచ్చిన కొత్త డైట్ చార్జీలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


ఇంటిగ్రేడ్ వసతి గృహంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

కార్వేటినగరం: ప్రభుత్వ వసతి గృహాల్లో సరికొత్త మెనూ అమల్లోకి వచ్చింది. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. దాంతో హాస్టల్ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించనుంది. నాడు–నేడు పథకం ద్వారా ఇప్పటికే వసతి గృహాలను అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి మెస్ చార్జీలను పెంచి విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. నిత్యావసరాల ధరలు పెరగడంతో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందడం లేదని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం మే నెలలోనే కొత్త డైట్ చార్జీలను ప్రకటించింది. వసతి గృహాలు తెరిచిన వెంటనే కొత్త మెనూ అమలులోకి రావడంతో వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఆనందంగా విద్యనభ్యసిస్తున్నారు.

3 రోజుల పాటు చికెన్ కర్రీ భోజనం

కొత్త మెనూ ప్రకారం వసతి గృహాల్లోని విద్యార్థులకు వారంలో మూడు రోజుల పాటు చికెన్ కర్రీతో భోజనం, ఆరు రోజుల పాటు కోడి గుడ్డు,


ఇంటిగ్రేడ్ హాస్టల్లో భోజనం చేస్తున్న విద్యార్థినులు

ఉదయం టిఫిన్, పాలు, ఆదివారం కాకుండా సెలవు దినాల్లో మధ్యాహ్నం భోజనంలో అన్నం, సాంబర్, గుడ్డుకూర తప్పనిసరి చేశారు. రోజూ రాత్రి భోజనం తరువాత అరటి పండు ఇవ్వాల్సి ఉంటుంది

డైట్ చార్జీల పెంపు ఇలా..

మూడు నుంచి ఐదో తరగతి వరకూ గతంలో డైట్ చార్జీలు నెలకు ఒక్కో విద్యార్థికి రూ.1000 ఉండగా ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.1,150 చేశారు. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1,250 నుంచి రూ.1400, ఇంటర్ ఆపైన చదివే విద్యార్థులకు రూ.1400 నుంచి రూ.1600లకు ప్రభుత్వం పెంచింది.

పెంచిన కాస్మొటిక్ చార్జీలు ఇలా..

కాస్మొటిక్ చార్జీలు మూడు నుంచి ఆరో తరగతి వరకు బాలురకు రూ.110 నుంచి రూ.120, బాలికలకు రూ.110 నుంచి రూ.130కు పెరిగింది. ఏడు నుంచి పదో తరగతి బాలురకు ప్రభుత్వం రూ.125 నుంచి రూ.150, బాలికలకు రూ.160 నుంచి రూ.200కు పెంచింది. ఇంటర్ ఆపైన చదివే విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.200 వరకు పెంచింది. కాస్మొటిక్ చార్జీలను విద్యార్థులు, లేదా వారి తల్లిదండ్రుల ఖాతాల్లో నేరుగా ప్రభుత్వమే జమచేస్తోంది. ఈ ఏడాది జూన్ నుంచి వారి ఖాతాల్లో నగదు జమ అవుతోంది.

రుచికరమైన భోజనం



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంతో పాటు హాస్టళ్లలోని విద్యార్థులకు కూడా రుచికరమైన భోజనం అందుతోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల మాలాంటి ఎంతో మంది పేద విద్యార్థుల చదువులు సాఫీగా సాగుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా నూతన మెనూ, డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తాం.

– కిరణ్మయి, 10 తరగతి విద్యార్థిని, ఇంటిగ్రేడ్ హాస్టల్

పక్కాగా మెనూ అమలు



ప్రభుత్వం అమలు చేసిన నూతన మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. హాస్టళ్లలోని విద్యార్థులందరికీ డైట్ చార్జీలు పెంచడంతో పోషకాలతో కూడిన భోజనాన్ని అందిస్తున్నాం. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు రుచికరమైన భోజనం అందించడంలో రాజీ పడే ప్రసక్తే లేదు.

–హేమలత, ఇంటిగ్రేడ్ బాలికల వసతి గృహం వార్డెన్, కార్వేటినగరం

బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు మంజూరు

కార్వేటినగరం: భారతీయ సంచార్ నిగమ్ లిమిటెడ్ సిమ్ వాడే వినియోగదారుల కల త్వరలో నెరవేరనున్నట్లు ఎంపీపీ లత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు గ్రామాల్లో సిగ్నల్స్ రాక ఇబ్బంది పడేవారన్నారు. అయితే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప చొరవతో మండలంలోని గాజంకి, ఎర్రమరాజు, విజయమాంబాపురం గ్రామాల్లో సెల్‌టవర్లు ఏర్పాటుకు అనుమతులు మంజూరు అయినట్లు చెప్పారు. సెల్ టవర్ల ఏర్పాటుకు చొరవ చూపిన డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, అలాగే చిత్తూరు ఎంపీ రెడ్డెప్పకు ఎప్పటికీ రుణపడి ఉంటామని, కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ పలువురు ఉన్నారు.

అనారోగ్యంతో సంఘమిత్ర మృతి


శారద కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న డీఎంజీ సుధాకర్, ఏపీఎం విజయకుమార్

కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లికి చెందిన సంఘమిత్ర శారద(36) అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. వెలుగు కార్యాలయంలో సంఘమిత్రగా విధులు నిర్వహిస్తున్న శారద కొన్నాళ్లుగా గుండెజబ్బుతో బాధపడుతూ చికిత్స తీసుకుంటోంది. అయితే ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందింది. ఆమెకు ఒక కుమార్తె ఉంది. సమాచారం అందుకున్న వెలుగు ఏపీఎం విజయకుమార్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని ప్రభుత్వం తరఫున దహన క్రియలకు రూ.15 వేలు, సిబ్బంది తరఫున రూ.45 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. డీఎంజీ సుధాకర్, సీసీలు,సంఘమిత్రలు నివాళులు అర్పించారు.

కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకోండి


మాట్లాడుతున్న విశ్రాంత అధ్యాపకుడు రవివర్మ

పుత్తూరు రూరల్: విద్యార్థులు తమ కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ దిశగా కృషి చేయాలని వాణిజ్య శాస్త్ర విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ ఎస్.రవివర్మ తెలిపారు. సోమవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగ విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఉత్పత్తి, సేవారంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఫైనాన్స్, అకౌంటింగ్, మార్కెటింగ్, హ్యూమన్ రీసోర్స్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ వంటి విభిన్న రంగాలలో ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ బలహీనతలను గుర్తించి, వాటిని అధిగమిస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తిరుమలయ్య, వాసవి, శ్రీనివాసులు, లక్ష్మీబాయి, జ్యోతి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న వామపక్ష నేతలు

పుత్తూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ, విశాఖ ఉక్కు పరిరక్షణకై వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సోమవారం పుత్తూరులో విద్యార్థి సంఘాల నాయకులు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సంఘాల నాయకులు మాట్లాడుతూ 32 మంది విద్యార్థుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరించాలని చూడడం దారుణమన్నారు. ఫ్యాక్టరీ పరిరక్షణకు కార్మిక, ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళన నవంబర్ 8 నాటికి 1000 రోజులు అవుతున్న నేపథ్యంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన అన్ని విద్యా సంస్థలు బంద్‌కు సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

వెదురుకుప్పం ఎంపీడీఓగా ప్రేమ్‌రాజ్ కుమార్



వెదురుకుప్పం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ప్రేమ్‌రాజ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఆయన విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న సుధాకరరావు పదోన్నతిపై వెళ్లారు. పాలసముద్రం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ ఇక్కడకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, నాయకులు బొజ్జారెడ్డి, శివాజీ, జగదీశ్ రెడ్డి ఈ సందర్భంగా ఎంపీడీఓను మర్యాద పూర్వకంగా కలిశారు.

కార్యకర్తలే పార్టీకి బలం


మాట్లాడుతున్న మండల కన్వీనర్ మణి

శ్రీరంగరాజపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం అని మండల కన్వీనర్ మణి అన్నారు. మండలం కేంద్రం శ్రీరంగరాజపురంలో ఈ నెల 9వ తేదీ నుంచి జరిగే ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహణపై సోమవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి వలంటీర్, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వంలో వారు చేసిన మోసాలను, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో ప్రతి నాయకుడు, కార్యకర్తను సమన్వయం చేసుకుని సమష్టిగా పని చేసి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌రెడ్డి, రమేష్‌కు సన్మానం


విజయ్‌కుమార్ రెడ్డి, రమేష్‌ను సన్మానిస్తున్న సహకార బ్యాంకు ఉద్యోగులు

గంగాధర నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు ఎంప్లాయీస్ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా గంగాధరనెల్లూరు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ, జిల్లా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వి.ఎస్.విజయ్ కుమార్ రెడ్డిని, కార్యదర్శి రమేష్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. చిత్తూరు జిల్లా తరఫున రాష్ట్రస్థాయిలో కీలక పదవులకు వీరు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం చాలా గర్వంగా ఉందని జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్స్ బ్రహ్మానంద రెడ్డి, వనజ ,సిబ్బంది కొనియాడారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లాకు సంబంధించిన సహకార బ్యాంకు సీఈఓలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర విభాగంలో విస్తృత సేవలు


ఎమర్జెన్సీ విభాగం వద్ద సిద్ధంగా ఉంచిన స్ట్రెచ్చర్లు, వీల్ చైర్లు

తిరుపతి తుడా: స్విమ్స్ అత్యవసర విభాగం గాడిన పడుతోంది. అత్యవసర వైద్య సేవలకు వచ్చే రోగులందరికీ అత్యుత్తమ వైద్యాన్ని అందించే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అధికారులు ఆస్పత్రికి వచ్చే రోగులను వెంటనే అత్యవసర విభాగంలోకి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. అంబులెన్స్ వచ్చి ఆగిన వెంటనే రోగిని తరలించేందుకు అవసరమైన రెండు స్ట్రెచ్చర్లు, రెండు వీల్ చైర్లు, ఇందుకో అవసరమైన సిబ్బందిని సోమవారం నుంచి అందుబాటులో ఉంచారు. స్విమ్స్ ఆస్పత్రి ప్రత్యేక అధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి ప్రిన్స్ అత్యవసర విభాగానికి చికిత్స చేస్తున్నారు. గతంలో 60 శాతం మంది బాధితులను బెడ్లు లేవు అంటూ వెనక్కి పంపించే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం ఆ విధానానికి చెక్ పెట్టి అవసరమైన అందరికీ అత్యవసర విభాగంలో చికిత్స అందించేందుకు పక్కా ప్రణాళికలను అమలు చేస్తున్నారు.

ప్రజారోగ్యానికే జగనన్న సురక్ష


రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

పెనుమూరు(కార్వేటినగరం): ప్రజారోగ్యానికే రాష్ట్రప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీటీసీ శివలింగం అన్నారు. సోమవారం ఆయన మండలంలోని తాటిమాకులపల్లి సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డాక్టర్ హర్షవర్ధన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని, గ్రామీణ ప్రజలు ఈ సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ హ్షావర్ధన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శిబిరంలో పాల్గొన్న 270 మంది రోగులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కంటి పరీక్షలు చేసుకున్న వారికి కంటి అద్దాలు, కేస్ షీట్‌ను అందించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గురుమూర్తి, తహసీల్దార్ కళావతి, డీటీఓ నాగభూషణం, వైద్య, సచివాయల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ మోసాలను ఎండగట్టండి


మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి

- ప్రజాసంక్షేమ పాలన గురించి ప్రజలకు వివరించండి
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో నేతల పిలుపు

వెదురుకుప్పం: ప్రజలను తెలుగుదేశం పార్టీ ఎలా మోసం చేసిందో ప్రజలకు వివరించడంతో పాటు 2019లో వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన విషయాన్ని కూడా ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కే.పద్మనాభరెడ్డి అన్నారు. సోమవారం వెదురుకుప్పంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు జరిగిన మంచిని వివరించి, టీడీపీ మోసాలను ఎండగట్టడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందరర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలతో మమేకమై గ్రామాల్లో బస చేసి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించిన విధానాలను వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం మండలంలోని 13 గ్రామ సచివాలయాలు ఉండగా మొదటి విడత 10 సచివాలయాల పరిధిలో ఈనెల 9 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9న మాంబేడు, 10న తిరుమలయ్యపల్లె1, 14న తిరుమలయ్యపల్లె2, 15న జక్కిదొన, 16న ఆళ్లమడుగు, 17న బొమ్మయ్యపల్లె, 20న బ్రాహ్మణపల్లె, 21న కొమరగుంట, 22న నల్లవెంగనపల్లె, 23న పచ్చికాపల్లంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ చిన్నబ్బ, జిల్లా స్టీరింగ్‌కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, గోవిందన్, సచివాలయ కన్వీనర్ జగదీష్ రరెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, గోపి పాల్గొన్నారు.

10న జగన్ననకు చెబుదాం


మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నింద్ర: మండల కేంద్రం నింద్రలో ఈ నెల 10వ తేదీ శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని ఎంపీపీ దీప అన్నారు. సోమవారం ఆమె మండలకేంద్రంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కార్యక్రమ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి రోజాతో పాటు జిల్లా కలెక్టర్ హాజరు అవుతారని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల సమస్యలను జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: స్పందనలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ బెన్నూరాజు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 13 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 02, డీకేటీ పట్టాలు కేటాయించాలని 03, ఇంటి నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని 02, తమ భూమిలో ఆక్రమణలను తొలగించి హద్దులను చూపించాలని 01, ఇంటి స్థలం ఇప్పించాలని 05 వినతులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చే సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు


సమావేశంలో మాట్లాడుతున్న యశోదారెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలో ఈ నెల 9న నిర్వహించే ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండల కన్వీనర్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మండలంలో సచివాలయాల వారీగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ హరికృష్ణ, సర్పంచ్ జయచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సేవాదల్ అధ్యక్షుడు దూది మునేంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దాము, రాజారెడ్డి, యతీశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి


టపాకాయలు దుకాణాల ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, తహసీల్దార్

పెనుమూరు(కార్వేటినగరం): టపాకాయల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కళావతితో కలసి ఆయన ముత్యాలమ్మ ఆలయం సమీపంలోని బహిరంగ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాకాయల విక్రయదారులు అగ్నిమాపక, పోలీసు అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. ఇచ్చిన అనుమతులకు లోబడి విక్రయదారులు కేటాయించిన ప్రాంతంలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కిరాణా దుకాణాలు, ఇళ్ల వద్ద టపాసులు విక్రయిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ బాణసంచాల విక్రయదారులు కచ్చితంగా తమ దుకాణం వద్ద నీటి ట్యాంకరు, ఇసుక మూటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.